www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
5
వైఎస్ఆర్

పుష్పగిరిలో వైభవంగా ధ్వజావరోహణం

వల్లూరు: పవిత్ర పుణ్యక్షేత్రం దక్షిణ కాశి పుష్పగిరిలో బుధవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా ధ్వజావరోహణం నిర్వహించారు. ఉదయం వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, అభిషేకం నిర్వ హించారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, పుణ్య హవాచనం, అగ్నిప్రతిష్ఠాపన, నవకలశస్థాపన, నవకుంభారోహణ పూజ, ధ్వజావరోహణం, భేరీ పూజ, పంచసూక్త హోమాలు నిర్వహించారు. కొండపైన నెలకొన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి ఉదయం గణపతిపూజ, రుద్రాభిషేకం, కుంకు మార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, నవకలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.

ధ్వజావరోహణ నిర్వహిస్తున్న అర్చకులు

భూబకాసురుల భరతం పడతా

మాజీ మంత్రి వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

- బద్వేలు విస్తృత సమావేశంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/బద్వేలు

బద్వేల్‌లోని భూబకాసురుల భరతం పడతామని, భూబాధితులకు తిరిగి వారి భూములు వారికి ఇప్పిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం బద్వేల్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి కె.శే బిజివేముల వీరారెడ్డి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పంచాయతీ సమితి బోర్డు సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించి తిరుగులేని నేతగా ఎదిగారని కొనియాడారు. ఆయన పట్ల ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి వాటిల్లుతున్న నష్టాన్ని ఓటర్లకు వివరించాలన్నారు. టిడిపి హయాంలో చేపట్టిన రంజాన్ తోఫా, అన్న క్యాంటీన్, విదేశీవిద్య వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఒక అసమర్థుడు పాలన సాగిస్తే ఏమి జరుగుతుందో అనుభవాలతో పస్తోందన్నారు. రిలయన్స్ సోదరుల్లో ఒకరు ఆసియాలో నెంబర్ వన్‌గా నిలిస్తే మరొకరు నామమాత్రంగా మిగిలి పోయారని గుర్తుచేశారు. టెక్నాలజీలో రెవల్యూషన్ తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. ఎన్‌హెచ్ పాలసీ ద్వారా తమిళనాడు నుంచి నెల్లూరు వరకు జాతీయ రహదారిని నిర్మించామన్నారు. త్వరలో బద్వేల్‌కు ఔటర్ రింగురోడ్డు వస్తుందని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ బద్వేల్‌లో టిడిపి అభ్యర్థిని గెలిపించి అధ్యక్షులు చంద్ర బాబుకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇవ్వడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడై పని చేయాలని తెలిపారు. యువ నాయకుడు రితేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ తాత బిజివేముల వీరారెడ్డి ఆశయాలకు వారసునిగా వచ్చానని తెలిపారు. తనకు కార్యకర్తలే బలమూ, బలహీనతా అని చెప్పారు. సోమశిల వెనకజలాలు, కుందూ నుంచి ఐదు టిఎంసిల నీళ్లు ఇస్తామన్న పాదయాత్ర హామీ ఏమైందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను పరోక్షంగా ప్రశ్నించారు. బద్వేల్ భూదందాపై కమిషన్ వేయాలన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఓబులాపురం రాజశేఖర్ మాట్లాడుతూ 2019లో బద్వేల్‌కు టిఎంసి నీటి తరలింపునకు ఇచ్చిన జీవో బుట్టదాఖలు కావడం ఆందోళనకరమని తెలిపారు. ఫలితంగా మూడు మండలాలకు నీటి చుక్క కరువై అలమటిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరోసభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, అమీర్‌బాబు, టిడిపి నాయకులు రితేష్‌రెడ్డి, బొగ్గుల గుర్రప్ప, ఓబులాపురం రాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, పెద్దఎత్తున కార్య కర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

పోరుమామిళ్ల : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బద్వేల్ పర్యటన ముగించుకుని గిద్దలూరుకు వెళుతూ పోరుమామిళ్ల పట్టణంలోని గాంధీ బొమ్మ సర్కిల్‌లో ఆగి మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్‌తో కలిసి గాంధీ బొమ్మకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడును సుధాకర్ దంపతులు శాలువతో సన్మానించారు.

చంద్రబాబుకు శ్వేతారెడ్డి సన్మానం

కాశినాయన : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండల పరిధిలోని ఓబులాపురం క్రాస్ వద్ద తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు మహిళా అధ్యక్షులు కర్నాటి శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో భారీ జన సమూహంతో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నర్సాపురం మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బారెడ్డి నరసాపురం ప్రజలు బాలరాజుపల్లె, సావిశెట్టిపల్లె, బాలయ్యపల్లె, ఉప్పలూరు, మిద్దెల వద్ద స్వాగతం పలికారు.

పురపాలిక ఆదాయానికి భారీగా గండి!

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయం

- నాలుగేళ్లలో రూ.1.25 కోట్ల నష్టం
- ఓ నాయకునికి ఆదాయ వనరుగా మారిన వైనం
- ప్రజాధనం దోపిడీకి తెరతీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణం పంచాయతీ నుంచి నగర పంచాయతీగా 2012లో రూపాంతరం చెందింది. నగర పంచాయతీ అయితే ఎక్కువగా నిధులు సమకూరి అభివృద్ధి జరుగుతుందని ప్రజలు కూడా అభిప్రాయపడ్డారు. అభివృద్ధి గురించి పక్కన పెడితే ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి నగర పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు. వివరాల్లోకి వెళితే..2015 నుంచి 2019 వరకు టిడిపి పాలనలో 43 పనులకు సంబంధించి ఎర్రగుంట్ల నగర పంచాయతీ కాంట్రాక్టర్లకు టెండర్లను ఆహ్వానించింది. ఈ 43 పనులకు సంబంధించి రూ.2.90 కోట్లతో టెండర్లను విడుదల చేశారు. అందులో పాల్గొన్న కాంట్రాక్టర్లు అధికంగా 34.20 శాతం లెస్‌కు కోట్ చేశారు. అత్యల్పంగా 6.3 శాతం లెస్‌లకు వేశారు. ఈ మొత్తం పనులకు సంబంధించి రూ.51.16 లక్షల నగర పంచాయతీకి ఆదాయం సమకూరింది. 2019 నుంచి 2023 వరకు ప్రస్తుత ప్రభుత్వంలో 45 పనులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. ఈ 45 పనులకు సంబంధించి రూ.7.81 కోట్లతో టెండర్లు విడుదల చేశారు. అందులో పాల్గొన్న కాంట్రాక్టర్లు అధికంగా 8.19 శాతం లెస్ వేయగా, అత్యల్పంగా 0.01 లెస్‌కు వేయడం గమనార్హం. ఈ మొత్తం పనులకు సంబంధించి రూ.11.18 లక్షలు మాత్రమే నగర పంచాయతీ ఖజానాకు చేరింది. 2015-19 వరకు జరిగిన పనులకు సంబంధించి సరాసరి 17.42 శాతం లెస్సులకు కాంట్రాక్టర్లు పనులు దక్కించుకోగా, 2019-23 వరకు జరిగిన పనులకు సంబంధించి సరాసరి కేవలం 1.43 శాతం లెస్సులకు పనులు దక్కించుకోవడం విశేషం. ఈ గణాంకాల ప్రకారం 2019-23 వరకు జరిగిన మొత్తం పనులకు సంబంధించి సరాసరి 16 శాతం అనగా సుమారు రూ.1.25 కోట్లు నగర పంచాయతీ ఆదాయానికి గండి పడిందని చెప్పవచ్చు. ఈ గణాంకాల వివరాల మేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాంట్రాక్టర్ల ద్వారా నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధికి 4 శాతం నుంచి 8 శాతం, స్థానిక ప్రజాప్రతినిధికి 1 శాతం నుంచి 2 శాతం, అధికారులకు 1 శాతం నుంచి 2 శాతం వరకు ముడుపులు అందుతున్నాయని సమాచారం. 2019-23 వరకు మొత్తం 45 పనులకు టెండర్లు ఆహ్వానించగా అందులో 25 పనులకు సంబంధించి పోటీ లేకుండా ఒకే టెండర్ దాఖలు కావడం విశేషం. ఇటువంటి సంఘటనలు చూసిన తరువాత కాంట్రాక్టర్లు ముడుపులు అందిస్తున్నారనేది వాస్తవం కాక మానదని ప్రజల అభిప్రాయపడుతున్నారు. టిడిపి హయాంలో నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు పోటీ పడడంతో నగర పంచాయతీకి ఆదాయం వచ్చేది. ప్రస్తుత పాలనలో నిర్మాణ పనులు దక్కించుకోవడానికి వచ్చిన కాంట్రాక్టర్లను అడ్డుకోవడం, తమకే పనులు రావాలని పోటీకి ఎవరు రాకుండా స్థానిక నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడంతో నగర పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండి పడింది. ప్రజల నుంచి ఏటా కోట్ల రూపాయల పన్నుల రూపంలో రాబడుతూ ఇలా ప్రజాప్రతినిధులు దోచుకుంటున్నారని వాదన ప్రజల్లో బలంగా వినపడుతుంది.

బిల్లులు రాకపోవడంతో టెండర్లకు పోటీ లేదు

అప్పటికీ ఇప్పటికీ టెండర్లలో లెస్ శాతం తగ్గడం వాస్తవమే. దాదాపు రెండేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో టెండర్లు వేసే కాంట్రాక్టర్ల మధ్య పోటీ లేకపోవడంతోనే లెస్ శాతం తగ్గింది. లెస్ శాతం తగ్గినా కూడా ఎక్సెస్‌కు మాత్రం ఎవరిని టెండర్లు వేయనియడం లేదు.

- పగడాల జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్, ఎర్రగుంట్ల.

చంద్రబాబుకు నిరసన సెగ

బద్వేలు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం బద్వేల్‌లో టిడిపి కార్యకర్తల సమావేశాన్ని ముగించుకుని గిద్దలూరుకి వెళ్లే దారిలో బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులతో కలిసి యువగలంలో నారా లోకేష్ అంబేద్కర్ దూరవిద్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నల్లజెండాలు, బెలూన్లతో చంద్రబాబుకు వ్యతిరేకంగా చంద్రబాబు గో బ్యాక్ నినాదాలు చేశారు. బద్వేలు పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో చంద్రబాబు కాన్వాయ్ వెంబడి తెలుగు తమ్ముళ్లు బాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

చెన్నూరు: విచారణలో ఉన్న పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని ఎస్‌పి అన్బురాజన్ అన్నారు. బుధవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐ శ్రీనివాసులరెడ్డిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో కడప రూరల్ సిఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

చెన్నూరు: రంజాన్ మాసంలో తెల్లవారుజామున ఉపవాసం ఉండే వారికి అన్నదానం చేయడం చాలా మంచి పుణ్యకార్యమని మైనార్టీ నాయకులు అన్వర్ భాష, అబ్దుల్ రబ్, హబీబ్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం రోజు నుండి ముగిసే వరకు ప్రతిరోజు తెల్లవారుజామున ఒక్క పొద్దులు ఉండేవారికి దాదాపుగా 200 మందికి పైగా దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో 'చైతన్య' విద్యార్థి ప్రతిభ

కడప అర్బన్ : దేశ వ్యాప్తంగా మార్చి 25 వ తేదీన జరిగిన పరీక్ష ఫలితాల్లో కడప జోన్‌లో మొదటి గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాబ్ గెలిచిన షైక్ ఖుర్రతుల్ ఐన్‌ను నగర మేయర్ కె.సురేష్ బాబు అభినందించారు. ఖుర్రతుల్ ఐన్ తండ్రి షైక్ షావలి జిల్లా పరిషత్ ఆఫీస్ లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. నగరలోని చైతన్య కడప-3 బ్రాంచ్‌లో 7వ తరగతిలో చదువుతున్న ఖుర్రతుల్ ఐన్‌కు మొదటి గ్రాండ్ ప్రైజ్ రావడంతో పాఠశాల ఎజిఎం రమణయ్య హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ షర్మిల, పాఠశాల డీన్ మల్లి కార్జున ఐసిఒఎన్ ఇన్‌ఛార్జి శ్రవణ్, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ రాజగోపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు పూర్తిచేయండి

కడప: జాతీయ రహదారుల భూసేకరణపనులు యుద్ధ ప్రాతిపదన పూర్తిచేసి వెంటనే నష్టపరిహార నిధులను విడుదల చేయాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్‌హెచ్‌ఎఐ భూ సేకరణపై సమీక్ష సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణ విషయమై త్వరితగతిన పనులు జరగాలని ఆదేశించారు. అధికారులు అలసత్వం వహించక పనులు యుద్ధపాతికపదిన నిర్వహించవలసిందిగా ఆదేశించారు. సమావేశంలో జెసి జి.గణేష్ కుమార్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, కడప, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఒలు ధర్మచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎన్‌హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, మేనేజర్, ఎన్‌హెచ్ తిరుపతి మేనేజరు, నెల్లూరు ఎన్‌హెచ్ భూ సేకరణ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాయల మాంత్రికుడు సిఎం జగన్ : టిడిపి

మాట్లాడుతున్న సుబ్బయ్య

కడప అర్బన్ : మాయల మాంత్రికుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, న్యాయవాది ఎల్.శివ శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చిన్నాన్నను చంపింది చంద్రబాబు అని, నారావారి రక్త చరిత్ర అని చెప్పారన్నారు. ప్రజల పైన పన్నులు, కరెంటు, బస్సు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల పైన బాదుడే బాదుడు అన్నాడని పేర్కొన్నారు. ఉద్యోగస్తులకు పిఆర్‌సి అది ఎంత పని వారంలో అయిపోతుంది అన్నారని చెప్పారరన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, జయ శేఖర్, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, కుంట శివ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కడప అర్బన్: కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విసిట్‌లో భాగంగా 16వ డివిజన్లఓని ఇందిరానగర్, బిఎస్ తాండ, సుబ్బన్నగారిపల్లె ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఇంద్రానగర్ సర్కిల్ వద్ద రోడ్డు మరమ్మతులను చేయించవలసినదిగా, ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సిందిగా ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. రోడ్లపై ఉన్నటువంటి సిఎండి వేస్ట్ తొలగించు విధంగా చర్యలు తీసుకోవాలని ప్లానింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. రోడ్లపై అనవసరమైన స్పీడ్ బ్రేకర్లను గుర్తించి వాటిని తొలగించు విధముగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

బిజెపి పాలనకు చరమగీతం పాడదాం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ, ప్రజల మధ్య వైశమ్యాలను రెచ్చగొట్టి, దేశ సమైక్యత, సమగ్రతకు తూట్లు పొడుస్తున్న బిజెపి, మద్దతిస్తున్న వైసిపిలను రాబోయే ఎన్నికల్లో గద్దె దించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్కే నగర్‌లో ప్రచార భేరిని ప్రారంభించి వారు మాట్లాడుతూ నల్ల ధనం వెలికితీత, రైతు ఆదాయం రెట్టింపు, పేదరిక నిర్మూలన, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పన, ధరల స్థిరీకరణ, దేశ సమైక్యత సమగ్రాభివృద్ధి సాధించడంలో బిజెపి ఘోరంగా విఫల మైందన్నారు. పెట్రోలు డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దు జిఎస్టి వల్ల పనుల భారం తగ్గుతుందన్న మోడీ ప్రకటనకు విరుద్ధంగా ప్రజలపై పన్నుల భారం పెరిగిందన్నారు. ప్రజలు ప్రజా సమస్యలను పక్కకు నెట్టి దేవుని పేరుతో దేశభక్తి పేరుతో కులం పేరుతో మతం పేరుతో రెచ్చగొడుతూ, తినే తిండి, కట్టుకునే బట్టపై ఆంక్షలు విధిస్తూ దళిత మైనారిటీలపై దాడులకు పాల్పడుతున్నదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, నగర సహాయ కార్యదర్శి బాదుల్లా, మద్దిలేటి, బందల ఓబయ్య, సావంత్ సుధాకర్ సిపిఎం నగర నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, సిపిఐ నగర నాయకులు బ్రహ్మం, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, అంకుశం, వలరాజు, నాగార్జున, సంజీవ్, అరుణ్, తేజ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** తొమ్మిదేళ్ల నరేంద్ర మోడీ బిజెపి పరిపాలనలో ప్రభుత్వ సంస్థలను ధ్వంసం చేసి సంపన్నులకు రాయితీలు ఇచ్చి పేదలపై అనేక భారాలు మోపారని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ప్రసాద్ విమర్శించారు. స్థానిక పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బిజెపి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు ప్రసా ద్‌రెడ్డి, దండు రవి, కమాల్ బాషా, ఆదాము, మన్సూర్, మారి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** బిజెపి మతోన్మాద కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ చేపట్టిన ప్రచారభేరిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి అన్నారు. వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గోపాలకృష్ణయ్య, శ్రీనివాసరెడ్డి, చిన్న సిద్ధయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి

విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న థాపా

కడప అర్బన్ : విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా విద్యా బోధన చేయాలని 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ఆర్కే థాపా పిలుపునిచ్చారు. బుధవారం చిన్నచౌక్‌లోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, నడవడిక ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విద్యా సంస్థల డైరెక్టర్ ఎం.వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆధ్యాత్మిక వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ హరికృష్ణ, లక్ష్మయ్య, ఓబుల్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సలావుద్దీన్ కృతజ్ఞతలు

పార్కును పరిశీలిస్తున్న సలావుద్దీన్

కడప అర్బన్: మంజుమియ్యా సర్కిల్ అభివృద్ధికి కృషి చేసిన కార్పొరేటర్ షఫీకి ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కడప నగరంలోని గుంత బంజర్‌లో మంజుమియ్యా సర్కిల్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మంజుమియ్యా సాహెబ్ ఎంతో మహోన్నతమైన వ్యక్తి అన్నారు. కడప 31వ డివిజన్ కార్పొరేటర్ షఫీ మంజుమీయ్యా పార్క్ అభివృద్ధి కోసం పదేపదే ప్రభుత్వా దృష్టికి తీసుకుని వెళ్లి నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టారన్నారు. కార్పొరేట్ షఫీ తన డివిజన్‌లో ఎలా అభివృద్ధి కోసం కష్ట పడుతున్నారో ప్రతి కార్పొరేటర్ నగర అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు వరం జగనన్న విద్యా కానుక

డిక్షనరీని ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కడప అర్బన్: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న విద్యా కానుక వరం లాంటిదని జిల్లా సమగ్ర శిక్ష పథకాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రానికి చేరిన 18,950 డిక్షనరీలను ఆయన పరిశీలించారు. వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను జెవికె మండల కమిటీలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,58,721 మంది విద్యార్థులకు రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలు ఓపెన్ చేసిన మొదటి రోజే విద్యా కానుక కిట్లను ఇవ్వడానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ధనలక్ష్మి, కేశవరెడ్డి, దశరథ రామ్‌ఃరెడ్డి, రమణమూర్తి, ఎంఇఒ పాలెం నారాయణ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పెంచలయ్య, విజయ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కడప అర్బన్ : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా అన్నారు. బుధవారం నాగరాజుపేటలో డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ పార్థసారథి నిర్మించిన క్యూర్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. అనంతరం క్యూర్ హాస్పిటల్ మేనేజింగ్ పాట్నర్ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌ను అధునాతనమైన పరికరాలతో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ నిత్యానందరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి, శివయ్య యాదవ్, సిద్ధవటం మాజీ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ ఏకుల రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ

కడప: జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార నిమిత్తం ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ భవన్ నుంచి డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఎస్ఇ ఎస్.మునిశంకరయ్య తెలిపారు. 08562-242457 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి : జడ్జి

కడప: వేసవిలో పిల్లల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత సూచించారు. బుధవారం కడప నగరం కొండయ్యపల్లిలో ఉన్న శిశు గృహాన్ని జడ్జి సందర్శించారు. శిశు గృహంలో ఉన్న పిల్లల వివరాలను, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప: రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై యువత తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ సిఐ వి.శ్రీధర్ నాయుడు సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఐటిఐలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఇఒ సి.సాయి గ్రేస్, ప్రభుత్వ ఐటిఐ. అసిస్టెంట్ డైరెక్టర్, కె.రత్న రాజు, స్టెప్, క్రీడా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పులబాధతో దంపతుల బలవన్మరణం

యువ దంపతులు సాయి, హేమామాలిని (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-చెన్నూరు

చెన్నూరులో విషాదం చోటు చేసుకుంది. వివాహం జరిగిన ఏడాదికే దంపతులు సాయికుమార్‌రెడ్డి(30), హేమమాలిని (28) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటి అవసరం నిమిత్తం తన భూమిని తనకా పెట్టి ఒక వ్యక్తికి వద్ద రూ.3 లక్షల అప్పుచేసి, తిరిగి ఆ అప్పును ఇచ్చి తన భూమిని తనకు ఇవ్వాల్సిందిగా కోరితే ఇవ్వక పోగా పోలీస్ స్టేషన్లకు తిప్పి వేధించారు. తమకు న్యాయం జరగదని భావించి 8 నెలల గర్భిణీ అయిన తన భార్యతో ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చెన్నూరులో చోటు చేసుకుంది. మృతుని తల్లి వరలక్ష్మి వివరాల మేరకు... సాయి కుమార్‌రెడ్డి కడప నగరం పాలెంపల్లికి చెందిన నారాయణ స్వామికి రూ.మూడు లక్షలకు ఆయకానికి పెట్టారు. ఆయకానికి పెట్టే ముందు తన డబ్బు వడ్డీతో సహా ఎప్పుడైనా చెల్లించండి, మీ భూమి మీకు తిరిగి ఇస్తానని నారాయణస్వామి చెప్పారు. ఇటీవల డబ్బు తీసుకొని తన భూమి తనకు ఇవ్వాలని సాయి కుమార్‌రెడ్డి నారాయణస్వామిని అడుగగా అతను ఇవ్వకపోగా అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టాడు. నారాయణస్వామి పోలీసులతో బెదిరించాడు. మానసికంగా వేధించడంతో మనస్థాపంతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కడప రైల్వే ఎస్ఐ రారాజు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి కనుమలోపల్లె నుండి కడప మార్చురీ, చెన్నూరు వరకు యువ దంపతుల మృహదేహాల అంత్యక్రియల ముగిసేంత వరకు దగ్గరుండి అన్ని కార్యక్రమాలు చూశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆ కుటుంబానికి అండదండగా నిలబడ్డారు.

సాయిది ప్రేమ వివాహం : సాయి కుమార్‌రెడ్డి, హేమ మాలినితో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వారు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కడప నగరంలోని దుర్గమ్మ కాలనీలో సంసారం ఉంటున్నారు. సాయి కుమార్‌రెడ్డి ఈకామ్ వాటర్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నారు. హేమమాలిని రియల్ ఎస్టేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు : యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త మండల వ్యాప్తంగా వ్యాపించడంతో అటు రామనపల్లి, ఇటు చెన్నూరు భవాని నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారిని కడసారిగా చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలి వచ్చారు.

జావాన్ల మృతికి బిజెపినే కారణం

కడప: పుల్వామాలో జవాన్ల మరణానికి బిజెపి ప్రభుత్వమే కారణమని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది జవాన్లను పాకిస్థాన్ ఉగ్రవాద చర్య విషయమై ఆనాటి రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపిన వివరాలు తీవ్ర దిగ్భ్రాంతి నికలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వారు బలికావడానికి పాక్ కుట్రల కంటే మన కేంద్ర ప్రభుత్వం, హోం, రక్షణ మంత్రిత్వ శాఖలు వైఫల్యాలే ప్రధాన కారణమన్నారు. రోడ్డు మార్గంలో వేలాది మంది సైనికులను పంపడం సరి కాదని కనీసం ఐదు విమానాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ శ్రీనగర్ ఐజి కేంద్ర మంత్రిత్వ శాఖకు చేసిన విజ్ఞప్తిని బుట్ట దాఖలు చేయడమే కారణమని తెలిపారు.

లింగమూర్తి కృషి గొప్పది

కడప: బిసి భవన నిర్మాణ సాధనకు కృషి చేసిన గొప్ప వ్యక్తి లింగమూర్తి అని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి అన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తిని బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ బిసి భవన నిర్మాణ నిర్మాణానికి లింగమూర్తి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. మూడేళ్లుగా అనేక దఫాలుగా వినతి పత్రాలు సమర్పించి పాత రిమ్స్‌లోనిభవన నిర్మాణానికి 20 సెంట్లు స్థలాన్ని సాధించారన్నారు. కడప పార్లమెంటు సభ్యులు అవినాష్‌రెడ్డి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేశారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ అధికారులతో భవన నిర్మాణ శంకుస్థాపన చేయించారన్నారు.

లింగమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

రాజుకు క్రికెట్ కిట్ అందజేత

కడప: ఈ నెల 23న జరగనున్న బదులు ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌కు కడప జిల్లాకు చెందిన రాజు ఎంపికయ్యారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్ రాజుకు అభినందనలు తెలియజేశారు. క్రికెట్ అసోసియేషన్ తరపున రాజుకు క్రికెట్ కిట్టు బుధవారం డిసిఒఎస్ కాజా మైనుద్దీన్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు టి.నాగేంద్ర కుమార్, సిరాజుద్దీన్ అందజేశారు. రాబోవు రోజుల్లో అన్ని మ్యాచ్‌లు బాగా ఆడాలని సూచించారు.

రక్షణ గోడ పనులు త్వరగా చేపట్టాలి

కడప: సిద్ధవటం మండల పరిధిలోని పెన్నానది పరీవాహక గ్రామాలైన లింగంపల్లి నుంచి టక్కోలి వరకు రక్షణ గోడ పనులను త్వరగా చేపట్టాలని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్షుమయ్య కోరారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది బడుగు బలహీన వర్గాల ప్రజలు నివాసం ఉంటున్నారని, పెన్నానది ఉప్పొంగి ప్రవహిస్తే రక్షణ గోడ లేని పక్షంలో పెద్ద ముప్పు చవిచూడాల్సి వస్తుందన్నారు. రక్షణ గోడ లేకపోవడంతో నందలూరు, రాజంపేట మండలాల్లో కొన్ని గ్రామాలకు జరిగిన ప్రమాదమే ఇక్కడ జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ అధికారులకు చాలామార్లు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను తక్షణం ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ సుశీల్ కుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా ఆర్‌సై నాయకులు నరసింహులు, అవినాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్షుమయ్య

రవీంద్రారెడ్డికి భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. బిటెక్ రవీంద్రారెడ్డికి గన్‌మెన్లు తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ పదవి పూర్తయిన వెంటనే బిటెక్ రవీంద్రారెడ్డికి జగన్ ప్రభుత్వం గన్‌మెన్లు తొలగించడం అన్యాయమన్నారు. వైసిపిలో ఎలాంటి పదవుల్లేని నాయకులకు గన్‌మెన్లు కల్పించిన ప్రభుత్వం.. ప్రాణహాని ఉన్న టిడిపి నాయకులకు భద్రత ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. బిటెక్ రవీంద్రారెడ్డికి ఎలాంటి హాని జరిగినా రాష్ట్ర డిజిపి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీలు నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు మెదర రవికుమార్, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణవలి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, అలిరెడ్డిపల్లె బాలకృష్ణారెడ్డి, గోగుల మల్లికార్జున, మహమ్మద్, డక్కా రమేష్, కుమ్మరాంపల్లె రెడ్డయ్య, రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న టిడిపి నాయకులు

'మా ఊరి సినిమా' టైటిల్ లాంచింగ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులకు చెందిన మహేష్ 'మా ఊరి సినిమా'లో హీరోగా నటించడం అభినందనీయమని, కష్టపడి ప్రేక్షకులకు నచ్చేలా నటన చేయాలని రిటైర్డ్ డిఎస్పి ఖలీల్ సౌదాగర్ ఆకాంక్షించారు. పట్టణంలోని విజయ గార్డెన్స్‌లో 'మా ఊరి సినిమా' టైటిల్ లాంచింగ్ కార్యక్రమాన్ని సినిమా ప్రొడ్యూసర్ మంజునాథరెడ్డి(బుల్‌రెడ్డి) హీరో మహేష్, హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఖలీల్ టైటిల్ లాంచింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేష్, హరి వారి టీం సభ్యులు చంద్ర, పటాన్ రాఘవేంద్ర, శ్రీనాథ్, శివారెడ్డి ప్రజలను నవ్వించడంలో భాగంగా టిక్‌టాక్ చేస్తూ ఒక మెట్టు ఎక్కి యూట్యూబ్ స్టార్స్‌గా పేరొందారన్నారు. ఇప్పుడు సినిమా రంగంలో అడుగుపెట్టడం చాలా అభినందనీయమన్నారు. ప్రొడ్యూసర్ మంజునాథరెడ్డి, డైరెక్టర్ శివరాం తేజ్, కెమెరామెన్ ధర్మ, చిత్ర యూనిట్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం యూనిట్ సభ్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అమృత్ పథకం ద్వారా రూ.120కోట్లతో ప్రొద్దుటూరు ప్రజలకు శాశ్వితంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పబ్లిక్ హెల్త్ అధికారులతో నీటి సమస్యపై ఆయన చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 15ఏళ్లుగా తాగునీటి సమస్య ప్రొద్దుటూరును పట్టిపీడిస్తోందన్నారు. మైలవరం జలాశయం నుండి రూ.120కోట్లతో అమృత్ పథకం ద్వారా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామన్నారు. మైలవరం నుండి ప్రొద్దుటూరులోని రెండు కొళాయిల వరకు నీటిని తీసుకొచ్చి శుద్ధి చేసి ప్రొద్దుటూరులోని ట్యాంకుల ద్వారా ప్రజలకు అందజేస్తామన్నారు. శ్రీశైలం ద్వారా గండికోటకు అక్కడి నుండి మైలవరం జలాశయానికి అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు నీరు సరఫరా అవుతుందన్నారు. శ్రీశైలంలో నీరు ఉందంటే ప్రొద్దుటూరుకు నీరు వచ్చినట్లే అన్నారు. కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్ డిఇ చెన్నకేశవరెడ్డి, కమిషనర్ వెంకటరమణయ్య, ఎంఇ సాయినాద్, డిఇ దస్తగిరి పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఆడపడుచులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వం నుండి డ్వాక్రా సంఘాలకు రావలసిన నగదు సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతుందని, అంతవరకు మహిళలు ఇబ్బందులకు గురికాకుండా తన సొంత నిధులతో సర్దుబాటు చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసారెడ్డి తెలిపారు. స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలోని సిఆర్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రావాల్సిన సొమ్ము దాదాపుగా రూ.5.50లక్షలు ఉందన్నారు. ఐదు సంఘాలకు చెందిన 50 మందికి రాకపోవడానికి గల కారణాలను బ్యాంక్ అధికారులతో చర్చించామన్నారు. సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోందని తెలిసిందన్నారు. అందాక ఆడపడచులు ఇబ్బందులకు గురికాకూడదని తన సొంత డబ్బును సర్దుబాటు చేస్తామని రాచమల్లు తెలిపారు.

నేడు అప్పనపల్లెలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని అప్పనపల్లె పంచాయతీలో పరిధిలోని మల్లాయపల్లె, బోయపల్లి గ్రామాల్లో గురువారం గడపగడపకూ మన ప్రభత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ముద్దనూరు : స్థానిక యానాది కాలనీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కాలనీలోని ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుంటే అలాంటి వాటికి నోటీసులు జారీ చేయాలని అనుడా జిల్లా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం మండలంలోని సర్పంచులకు, కార్యదర్శులకు, బిల్డింగ్ ప్లానర్స్‌కు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుండి ఇచ్చే ప్రతి అప్రూవల్‌ను ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CIVIL JUDGE, KADAPA.
O.S.No. 845/2021

Between:-
Vangimalla Sudharshan Reddy, S/o V.Nagamal Reddy, D.No.45/258-2-4, Balaji Nagar, Kadapa City. **...Plaintiff**

And

Nukareddy Siva Krishna Reddy, S/o N.Thirupal Reddy, R/at D.No.1/1106-A, Yerramukkapalli, Kadapa City.
...Defendant

నోటీసు

పైన దావాలో వాది, ప్రతివాది అయిన మీ పై ప్రామిసరీ నోట్ అమౌంట్ రాబట్టుకొనుటకు గాను పై కనబరచిన కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నాడు. మీకు ఏమైన ఆక్షేపనులు ఉన్న ఎడల ప్రతివాదులు అయిన మీరు 03-05-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపనులు తెలుపుకొనవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

జి.జ్ఞానప్రసాద్
అడ్వకేట్ & నోటరీ,
కడప.

మండుతున్న ఎండలు

నిర్మానుష్యంగా రోడ్లు - వడగాల్పులతో అల్లాడుతున్న జనం- చిరువ్యాపారుల పరిస్థితి వర్ణనాతీతం

సర్కిల్ వద్ద మండుటెండలో వ్యాపారాలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కడప

వేసవిలో ఎండలు మండుతున్నాయి. భగ్గుమంటున్న సూర్యప్రతాపానికి రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎండలకు చిరువ్యాపారులు, కూలీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఏప్రిల్ నుంచి ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకూ సూర్యప్రతాపం అధికమవుతోంది. 41 డిగ్రీల పైనే ఎండ తీవ్రత ఉండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10గంటలు దాటకముందే ఎండ తన ప్రతాపాన్ని చూపుతోంది. ఉదయం 11 గంటల సమయం దాటిందంటే జనం రోడ్లపై రావాలంటే భయపడుతున్నారు. భగభగ మండే సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. పిల్లలు బడికి పోవాలన్నా తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ఈ ఎండలకు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఇక కార్యాలయాలు, ఇతర డ్యూటీలకు వెళ్లేవారు ఎండలకు బెంబేలెత్తుతున్నారు. జీవనోపాధి కోసం రోడ్లపై మండుటెండలో చిరు వ్యాపారాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రెక్కాడితేకానీ డొక్కాడని పేదలు ఎండలో అలమటిస్తున్నారు. మండుటెండలో తలపై కొంగు వేసుకుని కొందరు, రుమాలు కట్టుకొని కొందరు రోడ్ల పక్కల కూర్చొని తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరి అవస్థలు వర్ణనాతీతం. నగరంలో ప్రతి వేసవిలో ఏర్పాటు చేసే చలివేంద్రాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడంలేదు. తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. కంపెనీ వాటర్ బాటిల్స్ ధరలు మండిపోతున్నాయి. అర లీటరు వాటర్ బాటిల్ రూ.10 నుంచి రూ.15. లీటర్ బాటిల్ రూ.20 నుంచి రూ.30వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే ఇక ఎండలు మే నెలలో ఎంత తీవ్రంగా ఉంటాయో ఊహించుకుంటేనే భయమేస్తోందని పలువురు హడలిపోతున్నారు. ఉన్నతస్థాయి, కార్పొరేషన్ అధికారులు ప్రజల దాహం తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో, బస్టాండ్ల వద్ద, ప్రభుత్వ పాఠశాలల వద్ద, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పులివెందుల రూరల్ : ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. వేసవి తీవ్రతను తట్టుకునేందుకు శీతల పానీయాలు, చల్లని పదార్థాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మరికొన్ని రోజులు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు వ్యవసాయ, ఉపాధి కూలీలు, కార్మికులు, కర్షకులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో లభించే శీతల పానీయాల కంటే మట్టి బానలో నీరు నిల్వ చేసుకొని తాగడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి నీరు సేవించడం వల్ల దప్పిక తీర్చుకునే అవకాశం ఉంది. ఆరు బయట పనులు సాయంత్రం వేళల్లో చేసుకోవాలని, శరీరానికి వేడి తగలకుండా తెలుపు కాటన్ వస్త్రాలు ధరించడం మేలని సూచిస్తున్నారు. ఎండలో పనిచేసే వారు మంచినీరు అధికంగా తాగుతూ ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పులివెందులలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

చాపాడు : ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు చేరుకోవడంతో జనం అల్లాడిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. జిల్లాలో గత పది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి క్రమంగా పెరుగుతూ 41.5 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రెండు వారాల క్రితం వరకు అకాల వర్షాలతో వాతావరణంలో వరుసగా మార్పులు చేసుకోవడంతో మబ్బులు వచ్చి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఇటీవల నుంచి ఏరోజుకారోజు క్రమంగా పెరుగుతున్న ఎండలతో ఉక్కపోత, వేడికి తట్టుకోలేక జనం అల్లాడుతున్నారు. వాటర్ కూలర్లు, ఎసిలను వినియోగిస్తున్నారు. కూలీలు ఎండకు తట్టుకోలేక ఉదయం 6గంటలకే పనులు ప్రారంభించి, మధ్యాహ్నం 1గంటలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఎండలతో విద్యుత్తు వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. విద్యాసంస్థలు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నా, మధ్యాహ్నం పిల్లలను ఇంటికి తీసుకువచ్చే క్రమంలో తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

జనాల్లేక రోడ్లన్నీ నిర్మానుష్యం

జిల్లా కేంద్రంతోపాటు ఎంతో రద్దీగా ఉండే ప్రొద్దుటూరు ప్రధాన రహదారులు సైతం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనాల్లేక బోసిపోతున్నాయి. కడప కోటిరెడ్డి సర్కిల్, వైవి స్ట్రీట్, ప్రొద్దుటూరు శివాలయం, బంగారు దుకాణాలు, వ్యాపార సముదాయాలు కూడా మధ్యాహ్నం సమయంలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. సాయంత్రం వేళలో మాత్రమే నగరవాసులు బయటకు వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. శీతల పానీయాలు, చెరుకు రసం, కొబ్బరి నీళ్ల విక్రయించే దుకాణాలకు డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో పలువురు ఈతకు వెళుతూ సేదదీరుతున్నారు. వడగాలులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని సూచిస్తున్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

వేసవికాలం ప్రారంభం కావడంతో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ప్రజలు అవసరం మేరకు మాత్రమే తిరగాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు ముగించుకోవాలి. మధ్యాహ్నం సమయంలో సేద తీరాలి. మంచినీరు, కొబ్బరినీరు అధికంగా సేవించాలి. వడదెబ్బ సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ రాజేష్ కుమార్, వైద్యాధికారి, చాపాడు

బావిలో ఈతకొడుతున్న యువకులు

అగ్నిప్రమాదాల్లో సమయస్ఫూర్తి ముఖ్యం

మాట్లాడుతున్న అగ్నిమాపక జిల్లా అధికారి బసివిరెడ్డి

ప్రజాశక్తి - కడప

అగ్ని ప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించడం ద్వారా వాటి నుంచి సులభంగా బయటపడవచ్చునని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, అగ్నిమాపక కార్యాలయ జిల్లా అధికారి బసివిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, జంతు శాస్త్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బసివిరెడ్డి మాట్లాడుతూ పలు ప్రమాదాల నుంచి సమయస్ఫూర్తితో నివారించడం, ఎలా బయట పడవచ్చో ప్రదర్శించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వై.సావిత్రి, శివరామకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది అహ్మద్ శివకృష్ణ, అధ్యాపకులు రాజేశ్వరి, కల్పన, సునీత, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** హాస్పిటల్స్ సిబ్బంది అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక రోటరీ కంటి ఆసుపత్రిలో వైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, హాస్పటల్ సిబ్బంది, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉడాలని ప్రచురించిన కరపత్రాలను ప్రభుత్వాసుపత్రిలో అగ్నిమాపక అధికారులు పంపిణీ చేశారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి శివకుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులకు, వైద్య సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్లు వెంకట సుబ్బయ్య, హరిబాబు, మహమ్మద్ సాలార్, డ్రైవర్ ఆపరేటర్ చిన్న పెద్దయ్య, ఫైర్‌మెన్ రెడ్డిప్రసాద్, ప్రభాకర్‌రావు, జాన్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పోరుమామిళ్ళ కేంద్రాధికారి ఎల్.వసంత నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఒఎల్ఎఫ్ ఆస్పత్రిలో బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. యాజమాన్య, వైద్యులు, సిబ్బందికి అగ్ని ప్రమాద నివారణ చర్యలపై వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్ట ఉపయోగించరాదని సూచించారు. కాలి మెట్ల మార్గాన్ని, అత్యవసర మార్గాన్నిగానీ వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ లిల్లీ పుష్ప, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో అభ్యంతరాలుంటే చెప్పొచ్చు

ప్రజాశకి - ఎర్రగుంట్ల

మండల పరిధిలో జరుగుతున్న రీసర్వే పనుల్లో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలుంటే చెప్పొచ్చని జెసి గణేష్‌కుమార్ సూచించారు. ఈ పనులను బుధవారం ఆయన తహశీల్దార్ నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. కలమల్ల, మాలెపాడు గ్రామాల పరిధిలో పర్యటించారు. మండలవ్యాప్తంగా 15 రెవెన్యూ గ్రామాల్లో 55 వేల ఎకరాలకు సంబంధించి రీ సర్వే జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. రీ సర్వే పూర్తిఅయిన పొలాల్లో హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు పాతుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్పందన కార్యక్రమంపై జెసి సిబ్బందిని ఒకొక్కరిని పిలిచి అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ నాగేశ్వరరావుతో పలు సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిఐలు గురివిరెడ్డి, హరి, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, డిటి లక్ష్మీదేవి, సీనియర్ అసిస్టెంట్ వీరభద్ర, మునిసిపల్ ఆర్ఒ గంగిరెడ్డి, మున్సిపల్ ఎఇ సందీప్, వీఆర్ఒలు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెసి గణేష్‌కుమార్

ఆటో, చిరు వ్యాపారులకు అన్యాయం చేయొద్దు

నిరసన తెలుపుతున్న సిపిఎం సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఉన్న ఆటో కార్మికులకు, చిరు వ్యాపారులకు అధికారులు అన్యాయం చేయవద్దని, వారి పొట్టకొట్టవద్దని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య కోరారు. ఆ మేరకు బుధవారం వారు కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ వారితో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం ముందు ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పుడు అధికారులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రహరీ ఏర్పాటు చేస్తుండడంతో వారి బతుకుదెరువుకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆటోలు, వ్యాపారులను తొలగిస్తున్నారన్నారు. ప్రహరీకి అంత స్థలం అవసరం ఉండదని కొంత భాగాన్ని వారికి వదిలే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్మికుల వద్దకు వచ్చి అధికారులతో మాట్లాడారని, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారన్నారు. అధికారులతో మాట్లాడినందుకు కార్మికులు, చిరు వ్యాపారులు తరఫున ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సిపిఎం, సిపిఐ నాయకులు ప్రసాద్‌రెడ్డి, విజయ్, ఆదాము, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, నన్నే పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో అన్నీ సమస్యలే

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మొరపెట్టుకున్న ప్రజలు

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన పునరావాస కాలనీల్లో ఏళ్ల గడుస్తున్నా సమస్యలు తీరడం లేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకి ప్రజలు మొర పెట్టుకున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. మండలంలోని చౌటిపల్లి పునరావాస వాస కాలనీలో బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా సమస్యలే ఎదురయ్యాయి. కాలనీ ఏర్పడినప్పటి నుంచి విద్యుత్, నీటి సమస్య తీరలేదని, మీరు వచ్చిన ప్రతిసారి మా గోడు చెబుతున్నా, మీరు కూడా పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మీ మాటలు కూడా అధికారులు వినడం లేదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించడం సారూ అంటూ ప్రజలు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వెళ్లాల కృష్ణారెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, సతీష్‌కుమార్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బి.సుకుమార్ రెడ్డి, బి.శ్రీనాథ్‌రెడ్డి, చింత రాజారెడ్డి, నవ జ్యోతిరెడ్డి, పెద్దిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శేఖర్, దామోదర్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. కొండాపురం సిఐ సుదర్శన ప్రసాద్, ఎస్ఐ రవికుమార్, ఎస్ఐ ఉత్తమరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు దస్తగిరి, రాంబాబు. సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లకు నిప్పు పెట్టినవారిని గుర్తించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మండలంలోని దేవగుడి గ్రామానికి చెందిన రైతు మురళి తాటి, నేరేడు చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెటిటన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి బుధవారం బాధిత రైతును పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.


కాలిన చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యమని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు సూచించారు. మండలంలోని చెర్లోపల్లి, కొత్తపేట, సుంకేసుల గ్రామాల్లో జరుగుతున్న కుటుంబ డాక్టర్ విధానం, టీకాల కార్యక్రమం, డాక్టర్ వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలకు పలు సలహాలిచ్చారు. కుటుంబ డాక్టర్ విధానాన్ని వివరించారు. అనంతరం చెర్లోపల్లి గ్రామంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అక్కడే ఉన్న అంగన్వాడీ కేంద్రంలోని టీచర్‌ను ఐరన్ మాత్రల గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్తపేటలో డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా అధికారి వెంట ఆరోగ్య అధికారి మునిరెడ్డి, ఎపిడమిక్ ఇన్‌ఛార్జి కెఎస్‌వి ప్రసాద్ వచ్చారు. ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ అయేషా సుల్తానా, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం పాల్గొన్నారు.

వైద్యులకు సూచనలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

అధికారంలోకొస్తే ఆరుసూత్రాల కార్యక్రమం అమలు

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాల కార్యక్రమం అమలు చేస్తామని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వీరపునాయునిపల్లెలో బుధవారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.6 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామన్నారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని చెప్పారు. సమావేశంలో కమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వీరపునాయునిపల్లె మండల కన్వీనర్ పోచంరెడ్డి విశ్వనాథరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండ్లకుంట శ్రీరాములు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నజీర్ అహ్మద్, జకరయ్య, సత్తార్, పులివెందుల అసెంబ్లీ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న టూటౌన్ సిఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వివేకానంద కాలనీకి చెందిన షబానాకు ఆసియా (9) సాహిన్ (7) ఇద్దరు పిల్లలు. షబానా భర్త చనిపోవడం వల్ల కూలి చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయాన్ని పొరుగున ఉన్న మహిళలు టూ టౌన్ సిఐ ఇబ్రహీం దృష్టికి తీసుకెళ్లారు. రంజాన్ సందర్భంగా నిరుపేదలైన చాలామందికి ఆయన సహాయం చేస్తున్నారని మహిళలు వివరించారు. మానవత్వంతో స్పందించిన ఆయన వెంటనే సిబ్బందిని పిలిపించి షబానాను స్టేషన్ వద్దకు పిలిపించి బియ్యం ప్యాకెట్, నిత్యవసర వస్తువులు, పిల్లలిద్దరికీ కొత్త దుస్తులు అందజేశారు. షబానా సిఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది బాషా, కృష్ణారెడ్డి ఉన్నారు.

పులివెందుల టౌన్ : స్థానిక జామియా మసీదు జెండామాన్ వీధిలో బుధవారం వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ముస్లిం పేద కుటుంబాలకు సుమారు 80 కిట్లు నిత్యవసర సరుకులు రంజాన్ తోఫాగా పంపిణీ చేశారు. వైసిపి ముస్లిం నాయకులు నూరుల్లాహ్ మాట్లాడుతూ ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్తు ఆంగ్ల బోధనతోనే సాధ్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థుల భవిష్యత్తు ఆంగ్ల విద్య బోధనతోనే సాధ్యమవుతుందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డి సంయుక్తంగా తెలిపారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఇంగ్లీష్‌ఫెయిర్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యమిత్ర, పరిపాలన అధికారి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గాలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కలసపాడు

పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకుని స్థానిక దర్గాలో సుమారు 150 మంది ముస్లింలకు మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూముస్లిం సోదర భావంతో కలిసి మెలిసినప్పుడే సమాజంలో మానవత్వం విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి షరీఫ్, విశ్రాంత ఉపాధ్యాయుడు, మాబు సుభానీ, మతపెద్దలు, వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, ఖాతా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు మసీదులో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండలం టిడిపి బాధ్యులు మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వల్లెపు సుధాకర్, నవీన్, అరవింద్, పవన్, మాలిక్, ఇస్మాయిల్, సల్మాన్, మహేష్, నరేష్, సువార్తయ్య, సుబ్బరాయుడు, మునికృష్ణ, షేక్ షా, ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.